పోడు రైతులపై అక్రమ కేసులను ఎత్తివేయాలి

గిరిజనులతో సమావేశమైన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి

మాచారెడ్డి, జూలై 14 : గిరిజన పోడు రైతులపై అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నర్సింహులు అన్నారు. మండలంలోని నడిమి తండాలో గిరిజనులతో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన రైతుల పై అటవీశాఖ, పోలీసు అధికారులు జులుం ప్రదర్శిస్తున్నారని, అటవీశాఖ అధికారులకు పేదలైన గిరిజనులు డబ్బులు ఇవ్వకపోవడంతో దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. నాన్ పొజిషన్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారని అన్నారు. ప్రజాపాలన అని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి గిరిజన పోడు రైతులకు పట్టాలు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు.

ప్రశాంత్ ఆత్మహత్యకు కారకులపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి, జూలై 14 : రెవెన్యూశాఖలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ తెడ్డు ప్రశాంత్ ఆత్మహత్యకు కారణమైన డిప్యూటీ తహసీల్దార్‌ను అరెస్టు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగలి వెంకటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. దళిత ఉద్యోగి ప్రశాంత్ ఆత్మహత్యకు కారణమైన డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రస్తుత కాలంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులపై వేధింపులు చాలా పెరిగిపోయాయన్నారు. సమావేశంలో రాష్ట్ర కోశాధికారి సంగయ్య, ప్రతినిధులు రాజన్న, వంశీ, సాయిలు, నరసింహులు, వెంకటేశ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి స్థలం విరాళం

మాచారెడ్డి, జూలై 14 : మండలంలోని గజ్యానాయక్‌తండా ఎక్స్‌రోడ్ లో పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి రావుల ప్రభాకర్ రెండు గుంటల స్థలాన్ని విరాళంగా అందజేశారు.ఈసందర్భంగా ముదిరాజ్ కులస్తులు ఆదివారం స్థల దాత ప్రభాకర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అరిగే హన్మాండ్లు, లక్ష్మణ్, నారాయణ, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో దూడ మృతి

లింగంపేట, జూలై 14: మండలంలోని భవానీపేట గ్రామంలో కుక్కలు దాడి చేసి ఓ దూడను చంపేశాయని గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన ముకుందుగారి రఘు గేదెకు శనివారం రాత్రి దూడ జన్మించింది. పశువుల కొట్టంలో దూడపై కుక్కలు దాడి చేసి చంపాయి. గ్రామంలో కుక్కల బెడద తీవ్రంగా ఉన్నదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు స్పందించి గ్రామంలో కుక్కల బెడదను అరికట్టాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

భిక్కనూరు, జూలై 14: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన మెట్టు ప్రవీణ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. బాధిత కుటుంబానికి ఆదివారం కంచర్ల గ్రామానికి చెందిన గొల్ల నవీన్ రూ. నాలుగు వేల ఆర్థిక సాయం అందజేశాడు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన యువకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న యువకుడు

ఘనంగా బోనాల పండుగ

కామారెడ్డి/బిచ్కుంద/ ఎల్లారెడ్డి రూరల్/ నాగిరెడ్డిపేట/బాన్సువాడ, జూలై 14 : జిల్లాలోని పలు గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను ఘనంగా జరుపుకొన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని దేవీ విహార్ ఫేజ్ -2 కాలనీలో బోనాల పండుగ నిర్వహించగా.. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ పాల్గొని బోనం ఎత్తుకున్నారు. కార్యక్రమంలో 37వ వార్డు కౌన్సిలర్ పాత శివ కృష్ణమూర్తి , కాలనీ వాసులు పాల్గొన్నారు. బిచ్కుంద మండల కేంద్రంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనం నెత్తిన పెట్టుకొని డప్పు చప్పుళ్ల మధ్య పెద్ద పోచమ్మ ఆలయానికి చేరుకొని నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘ సభ్యులు గొడుబర్ల చంద్రకళ రాజు, యెల్కోటి రాజు,మాలెగాం పరమేశ్, శ్రీనివాస్, శెర్ల బాలరాజ్, గంగుల ప్రవీణ్, మహిళలు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి పట్టణంలో ముదిరాజ్ కులస్తులు బోనాల పండుగ నిర్వహించారు. ముదిరాజ్ సంఘం ఆవరణలో కొలువుదీరిన బురుజు మైసమ్మతల్లికి ఉదయం నుంచి మహిళలందరూ ప్రత్యేకపూజలు నిర్వహించి, బలి నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం బోనాలతో శోభాయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు ప్యాలాల రాములు, కోర్న నారాయణ, జనుముల పోచయ్య, అంజయ్య, ప్రశాంత్, భాస్కర్ మహిళలు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద గ్రామంలో మహంకాళి అమ్మవారికి ఆదివారం గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో బోనాల పండుగను నిర్వహించారు. బోనాల ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి ముందు బోనాలు ఉంచి, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఎల్లారెడ్డిలో ముదిరాజ్ సంఘ భవనంలో కొలువుదీరిన బురుజు మైసమ్మ తల్లి

మాల్తుమ్మెదలోని మహంకాళి అమ్మవారు

కామారెడ్డిలో బోనాల పండుగలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ

ఎల్లారెడ్డిలో బోనాల ఊరేగింపు

కొనసాగుతున్న రహదారి విస్తరణ పనులు

మాల్తుమ్మెద గేట్ వద్ద కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు

నాగిరెడ్డిపేట, జూలై 14: మండలంలోని పోచారం వద్ద నూతనంగా చేపడుతున్న రహదారి విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. పోచారం వద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపారుల కోకాలను తొలగించారు. అడ్డుగా ఉన్న చెట్లు, పొదలను నరికివేశారు. రోడ్డును తవ్వి వెడల్పు పనులు చేపడుతున్నారు. గ్రామానికి ఇరువైపులా రోడ్డు మధ్య నుంచి యాభై ఫీట్ల దూరంలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. రోడ్డు పక్కన డ్రైనేజీ పనులను ప్రారంభించారు. మాల్తుమ్మెద గేట్ వద్ద రోడ్డును తవ్వి కొత్తగా రోడ్డు వెడల్పు పనులు చేపడున్నారు.

నేటి నుంచి 'ఉపాధి' సోషల్ ఆడిట్ పై గ్రామ సభలు

రాజంపేట్, జూలై 14: మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 15 నుంచి 18 వరకు ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేశం తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామాల్లో 2023 ఏప్రిల్ ఒకటి నుంచి 2024 మార్చి 31 వరకు చేసిన పనులపై సోషల్ ఆడిట్ బృందాలు సభలు నిర్వహిస్తాయని తెలిపారు. 15న అన్నారం, ఎల్లారెడ్డిపల్లి తండా, గుడి తండా, ఆర్గొండ, పొందుర్తి, బస్వన్నపల్లి, 16న కొండాపూర్,గుండారం, ఆరెపల్లి, 18న శివాయిపల్లి, ఎల్లారెడ్డి పల్లి, నడిమి తండా, ఎల్లాపూర్ తండా, షేర్ శంకర్ తండా, రాజంపేట్, పెద్దాయిపల్లి, సిద్ధాపూర్, తలమడ్ల గ్రామాల్లో సభలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. సభల్లో గ్రామ స్పెషల్ ఆఫీసర్లు, కార్యదర్శులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

చుక్కాపూర్‌లో భక్తుల సందడి

మాచారెడ్డి, జూలై 14 : మండలంలోని చుక్కాపూర్ అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొన్నారు. ఒడిబియ్యం, పట్టెనామాలు, కోరమీసాలు, కండ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నూతన వాహనాలకు ప్రత్యేక పూజలు చేయించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు ఆలయ సిబ్బంది చేశారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

కంభం నాగయ్య(ఫైల్)

ఎల్లారెడ్డి, జూలై 14: పాముకాటుతో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కంభం నాగయ్య(43) శనివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పాము కరిచింది. అతడు వెంటనే కుటుంబీకులకు విషయం తెలిపాడు. వారు బాధితుడిని రుద్రారం గ్రామానికి తీసుకెళ్లి మంత్రం వేయించారు. అనంతరం ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యుడు పరిస్థితి విషమంగా ఉన్నదని, కామారెడ్డికి తీసుకెళ్లాలని సూచించాడు. కామారెడ్డికి తరలిస్తుండగా నాగయ్య మృతిచెందాడు. భార్య సత్తెవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

లింగంపేట, జూలై 14: మండలంలోని పోల్కంపేట గ్రామ మాజీ సర్పంచ్ మేడికుంద లక్ష్మి అనారోగ్యంతో ఉదయం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మి ఆదివారం మృతి చెందిందన్నారు. ఆమె పోల్కంపేట సర్పంచ్‌గా 2001 నుంచి 2003 సంవత్సరం వరకు పనిచేశారు.

ముదిరాజ్‌లను బీసీ 'ఏ'లో చేర్చాలి

మహాసభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ముదిరాజ్ సంఘు సభ్యులు

ఎల్లారెడ్డి రూరల్, జూలై 14: ముదిరాజ్‌లను బీసీ 'డీ' నుంచి బీసీ 'ఏ'లో చేర్చాలని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు బట్టు విఠల్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎల్లారెడ్డి పట్టణంలోని ముదిరాజ్ సంఘు భవనం వద్ద మహాసభ పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం జీవో 15ను వెంటనే అమలు చేయాలన్నారు. ఈనెల 20వ తేదీ వరకు ప్రతి రోజూ రెవెన్యూ కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తమ సమస్యలను తీసుకువెళ్తామని చెప్పారు. ముదిరాజ్ ఫైనాన్స్‌కు రూ.వెయ్యి కోట్లు కేటాయించి రుణాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చెరువులు, కుంటల్లో ముదిరాజ్‌లకు, బెస్త, గంగపుత్ర, గూండ్ల కులాలకు చెందిన వారికి పూర్తి హక్కులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ నాయకులు కుడుముల సత్యానారాయణ, ప్యాలాల రాములు, మర్రి బాలకిషన్, కోర్న నారాయణ, అతినారపు వెంకటేశం, ప్రకాశ్, ప్రశాంత్, అంజయ్య, జనుముల పోచయ్య, సతీశ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య

లింగంపేట, జూలై 14: మండలంలోని కోమట్‌పల్లి గ్రామానికి చెందిన ధరిణి ఎల్లయ్య (30) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లయ్య కుటుంబ కలహాలతో శనివారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లాడు. గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు ఆదివారం ఉదయం గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ కలహాలతో ఉరేసుకొని ఆత్మహత్యకు చేసుకున్నాడని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి సర్కారు దవాఖానకు తరలించామన్నారు. మృతుడికి భార్య ప్రవీణతోపాటు కుమారుడు ఉన్నాడని గ్రామస్తులు తెలిపారు.

వన మహోత్సవానికి మొక్కలు సిద్ధం

- ఇంటి ఆవరణలో నాటేందుకు కూడా..
- ఎల్లారెడ్డి మండలంలో మూడు లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- గ్రామాల్లో మొక్కలను పంపిణీ చేస్తున్న అధికారులు

ఎల్లారెడ్డి, జూలై 14: వన మహోత్సవం సందర్భంగా మొక్కలను నాటేందుకు ప్రభుత్వం గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటు చేసింది. నర్సరీల్లో పెంచిన మొక్కలను ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో నాటడంతోపాటు ప్రతి ఇంటికీ ఆరు మొక్కలను పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఎల్లారెడ్డి మండలంలోని 31 గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో సుమారు మూడు లక్షల మొక్కలను పెంచారు. వానకాలం ప్రారంభానికి ముందే అవసరమైన మొక్కల వివరాలను సేకరించి నర్సరీల్లో సిద్ధం చేశారు. ఇంటి ఆవరణలో నాటేందుకు నర్సరీల్లో పూలు, పండ్ల మొక్కలను పెంచారు. అడపా దడపా వర్షాలు కురుస్తుండడంతో అధికారులు ప్రతి ఇంటికీ ఆరు మొక్కలను పంపిణీ చేస్తున్నారు.

ఈజీఎస్ నిధులతో..

మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో నర్సరీలను ఏర్పాటు చేశారు. ఒక్కో నర్సరీలో పది వేల మొక్కలను పెంచారు. గ్రామాల్లో ఉండే ఇండ్ల సంఖ్యను ఆధారంగా చేసుకొని పండ్లు, పూల మొక్కలను సిద్ధం చేశారు. గ్రామస్తులకు పంపిణీ చేయగా.. మిగిలిన మొక్కలను గ్రామ పరిధిలో ఖాళీగా ఉండే ప్రభుత్వ స్థలాల్లో నాటేందుకు గుంతలను సిద్ధం చేశారు. ప్రతి ఇంటి ఆవరణలో ఆరు మొక్కలను నాటి సంరక్షించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

అందుబాటులో అన్ని రకాల మొక్కలు..

నర్సరీల్లో ప్రజలకు అవసరమైన అన్ని రకాల మొక్కలను పెంచుతున్నారు. పండ్ల రకాల్లో జామ, దానిమ్మ, చెర్రి, బాదాం, అల్లనేరేడు వంటి రకాలు అందుబాటులో ఉండగా.. పూల రకాల్లో బంతి, చామంతి, మందారం, తెల్ల చమన్, నల్ల చమన్ వంటి రకాలు సిద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో నాటేందుకు అడవి తంగేడు, కానుగ, పచ్చ తురాయి, ఎర్ర తురాయి, రావి, ఈత రకాలను నర్సరీల్లో పెంచారు.

రుద్రారం నర్సరీలో అందుబాటులో ఉన్న మొక్కలు

ఇంటికి ఆరు మొక్కలు పంపిణీ చేస్తున్నాం..

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఇంటికీ ఆరు మొక్కలను పంపిణీ చేస్తున్నాం. నర్సరీల్లో అన్ని రకాల పూలు, పండ్ల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. ప్రజలు ఉత్సాహంగా మొక్కలను తీసుకెళ్తున్నారు. నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి.

- హసన్, ఫీల్డ్ అసిస్టెంట్, రుద్రారం

సమాజంలో గురువు స్థానం చాలా పవిత్రమైంది

మద్నూర్, జూలై14: సమాజంలో గురువుస్థానం చాలా పవిత్రం, ప్రత్యేకమైందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కార్యవాహ రాజుల్‌వార్ దిగంబర్ అన్నారు. మండలకేంద్రంలోని లక్ష్మీనారాయణ మందిరం అవరణలో ఆదివారం గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు జన్మనిస్తే, గురువు ఉత్తమ జీవనమార్గం చూపిస్తారని తెలిపారు. ప్రతిఒక్కరూ తల్లిదండ్రులతోపాటు, గురువులను పూజించి గౌరవించాలని సూచించారు. కార్యక్రమంలో విభాగ్ కార్యవాహ బెజుగం సత్యనారాయణ, జుక్కల్ ఖండ కార్యవాహ జూబ్రే సంజీవ్, స్వయం సేవకులు వడ్డే నాందేవ్, సక్కర్ల నరేశ్, రచ్చ వెంకటాద్రి, గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాజుల్వార్ దిగంబర్

నేడు ధోతి గ్రామంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

డోంగ్లీ, జూలై 14: మండలంలోని ధోతి గ్రామంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు గ్రామ యువకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేసి అవసరం ఉన్న వారికి మందులు, కంటి అద్దాలు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. ఆపరేషన్ అవసరం ఉన్న వారికి లయన్స్ వాహనంలో బోధన్‌కు తరలించి ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
TOURS & TRAVELS

★ మహాదేవ టూర్స్: 6th నవంబర్-కార్తీక మాసంలో కాశీ+12 క్షేత్రాలు. Ac Bus 20 స్లీపర్+20 సిట్టింగ్ 15 రోజులు. చార్‌ధాం 20th, సెప్టెంబర్ 3rd Ac. సంప్రదించండి: 9676637578.
NT-339536
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మాట్లాడుతున్న నాయక్‌పోడ్ జిల్లా అధ్యక్షుడు పెంటయ్య

నిజాంసాగర్, జూలై 14: ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నాయక్‌పోడ్ జిల్లా అధ్యక్షుడు మొట్ట పెంటయ్య అన్నారు. నాయక్‌పోడ్ల జిల్లాస్థాయి సమావేశం ఆదివారం మహ్మద్‌నగర్ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 9వ తేదీన ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. నాయక్‌పోడ్‌లు ఐక్యంగా ఉండాలని సూచించారు. సమావేశంలో గాండ్ల రాంచందర్, గణేశ్, సాయిబాబా, సంజయ్, టి.సాయిలు, కాశీరాం, ఎస్.సాయిలు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాశీందూల సవారీ

గాంధారి, జూలై 14: మత సామరస్యానికి ప్రతీకైన కాశీందులా పీర్ల సవారీని మండలంలోని గండివేట్ గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా ఆశీర్‌ఖానలో కొలువుదీరిన పీరీలకు కొబ్బరికాయలు కొట్టారు. కోరికలు నెరవేరిన భక్తులు కాశీందూల పీరీలకు వెండి తొట్టెలు, వెండి గుర్రాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధుల్లో దుకాణ సముదాయాలు వెలిశాయి. చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

ఉత్సవాల సందర్భంగా గండివేట్‌లో వెలిసిన దుకాణాలు

ఆశీర్‌ఖానలో వెలిసిన పీరీలు

మల్లారెడ్డి చెరువు తూము కట్ట ధ్వంసం

75 ఎకరాల్లో సాగునీటికి ఇబ్బందులు

ఎల్లారెడ్డి రూరల్, జూలై 14: మండలంలోని మాచాపూర్ గ్రామ శివారులోని మల్లారెడ్డి చెరువు తూము కట్టను ఓ వ్యక్తి ధ్వంసం చేశాడు. మాచాపూర్ రైతులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మల్లారెడ్డి చెరువు కింద మాచాపూర్, భిక్కనూర్, మల్లయ్యపల్లి, వెంకటాపూర్ గ్రామాలు ఉన్నాయి. చెరువుకు పక్కనే ఉన్న తూము కట్ట నుంచి మీది, కింది కాలువల ద్వారా 150 ఎకరాలకు సాగు నీరు అందుతున్నది. నాగిరెడ్డిపేట మండలం జాన్కంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని తాటిగడ్డచెట్టు తండాకు చెందిన గన్యా నాయక్‌కు మల్లారెడ్డి చెరువు కింద భిక్‌నూర్ శివారులో పొలం ఉన్నది. పొలంలోని బోరుబావి నుంచి తాటిగడ్డచెట్టు తండాలోని తన ఇంటి వద్ద ఉన్న పొలం వరకు సాగునీటి కోసం జేసీబీతో తవ్వుతూ పైప్‌లైన్ ఏర్పాటు చేసుకుంటున్నాడు. పైప్‌లైన్ కోసం తూము కట్టను అడ్డంగా తవ్వి పైప్‌లైన్ వేశాడు. కట్ట ధ్వంసం చేయడంతో కింది కాలువ కింద ఉన్న 75 ఎకరాలకు సాగునీరు అందకుండాపోయే పరిస్థితి ఏర్పడింది. తూము శిఖం భూమిని ఆక్రమించుకున్నారని, శిఖం భూమిలో అంగోత్‌బాబీ అనే రైతు బోరుకూడా వేసుకున్నాడని మాచాపూర్ రైతులు ఆరోపించారు. సంబంధిత అధికారులు పరిస్థితిని పూర్తిగా సమీక్షించి, తవ్విన తూముకట్టను మూసి వేయించి సాగునీరు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని రైతులు దాసరి సుధాకర్, మంద కిషన్, మర్రి నరేందర్‌రెడ్డి, కుర్మ అంజయ్య, కుర్మ రవి, కుమ్మరి రాజు, మాచబోయిన అంజయ్య, పద్మారావు, నాయికోటి రాములు, హాజీపాషా, షకీల్ తదితరులు కోరారు.

పై విషయమై ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లును వివరణ కోరగా.. పైప్‌లైన్ కోసం తవ్వుతున్న విషయంపై తమకు సమాచారం లేదన్నారు. ఎవరు తవ్వారో వారితోనే పైపులైన్‌లు తీయించి, జేసీబీతో తవ్విన స్థలాన్ని మొత్తం పూడ్చించి, తూముకు ఎలాంటి ఇబ్బందులు కాకుండా చేయిస్తామన్నారు. అనుమతి లేకుండా తవ్వకాలు జరిపిన రైతుపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తవ్విన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రైతులు.. ఇన్‌సెట్‌లో పైప్‌లైన్